క్లుప్తంగా

మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ



ముఖ్యమంత్రిని కలిసిన హర్షవర్ధన్ రెడ్డి

ఏయూక్యాంపస్: మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ పెరుగుతోందని జగనన్న సచివాలయం, గృహసారథి ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వివరాలు వివరించారు. తొమ్మిది రోజులుగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజాస్పందన పెరుగుతోందని వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

నేడు గౌతు లచ్చన్న వర్ధంతి



డాబాగార్డెన్స్: సర్దార్ గౌతులచ్చన్న 17వ వర్ధంతిని బుధవారం జడ్జికోర్టు సమీపాన గల గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వైస్‌చైర్మన్, విశాఖ జిల్లా శ్రీశయన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, గౌతు లచ్చన్న అభిమానులు పాల్గొంటున్నట్టు తెలియజేశారు.

జూన్‌లో నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్

బీచ్ రోడ్డు: ఈ ఏడాది జూన్‌లో ముంబైలో మొట్టమొదటి నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు కన్వీనర్ రాహుల్ తెలిపారు. కాన్ఫరెన్స్ వివరాలను ఆయన మంగళవారం విలేకరులకు తెలియజేశారు. జూన్ 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ కాన్ఫరెన్స్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్స్ ప్రారంభించినట్టు తెలిపారు. భారతీయ ప్రజాస్వామ్యం, పార్లమెంట్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలనేది తమ సమ్మిళిత ప్రయత్నమన్నారు. యువ రాజకీయవేత్తలను ఏ విధంగా తీర్చిదిద్దగలమనే సందేహానికి ఈ కాన్ఫరెన్స్ తగిన పరిష్కారం అందించనుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విభిన్న పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ బ్యూరోక్రాట్లు, పౌర సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

ప్రజల వద్దకు సీపీఐ, సీపీఎం



నేరెళ్లకోనేరులో ప్రచారభేరి నిర్వహిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

అల్లిపురం: 'బీజేపీ హటావో.. దేశ్ కీ బచావో' నినాదంతో సీపీఐ, సీపీఎం ప్రచారభేరి కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించింది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఆధ్వర్యంలో అల్లిపురం నేరెళ్లకోనేరు, ఏడుగుళ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు ప్రజలకు కరపత్రాలు పంచారు. పైడిరాజు మాట్లాడుతూ నరేంద్ర మోదీ అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. జీఎస్టీ వంటి అనాలోచిత నిర్ణయాల వలన అనేక కంపెనీలు మూతపడి కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను ప్రమాదంలోకి నెడుతున్న బీజేపీ, దాని అనుకూల శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవడానికే ఈ కార్యక్రమం అని తెలిపారు. ప్రజలు భాగస్వాములై రాబోయే రోజుల్లో సీపీఐ, సీపీఎం చేసే పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు జి.కాసులరెడ్డి, చెల్లూరి బుజ్జి, జి.లక్ష్మణరావు, జి.ఫణీంద్ర, యు.నాగరాజు, అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మట్టికుండ.. చల్లగుండ

సూర్యభగవానుడు ప్రతాపాన్ని చూపిస్తూ విజృంభిస్తున్న వేళ .. గొంతు పొడిబారుతున్న తరుణంలో అమృత భాండంలా ఆదుకుంటోంది మట్టికుండ. మండుటెండలో సాంత్వన చేకూరుస్తున్నది ఈ కుండలోని నీరే. ఈ నీరే ఆరోగ్యానికీ మంచిదని వైద్యులు చెబుతున్నారు. వేలు పోసి కొన్న రిఫ్రిజిరేటర్ కంటే పేదవాడి ఫ్రిజ్‌గా పిలిచే ఈ కుండకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది.

- వేసవి వేళ కుండలకు పెరిగిన గిరాకీ
- ఆరోగ్యానికీ మంచిదంటున్న వైద్యులు



మార్కెట్లో అమర్చిన మట్టి కుండలు



మినరల్ వాటర్‌ను మట్టి కుండ ద్వారా ఇలా..

డాబాగార్డెన్స్: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. నగరంలోని అల్లిపురం కుమ్మరవీధి, మెయిన్‌రోడ్డు విశ్వేశ్వరాలయం ఎదురుగా గల కుమ్మరవీధి, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు మట్టికుండల అమ్మకాలకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో, వేలు ఖర్చు చేసి ఫ్రిజ్‌లు కొనలేని పేదలు, మధ్యతరగతి వారు మట్టికుండల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫ్రిజ్‌లోని నీరు కంటే మట్టి కుండలోని నీరే ఆరోగ్యానికి మంచిదని చెబుతుండడంతో ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం మట్టి కుండల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రోజుకు ఒక్కో కుటుంబం 25 కుండలు తయారు చేసి ఒక్కో కుండను రూ.120 నుంచి రూ.140 వరకు హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. తొలివారం వరకు రోజుకు 20 నుంచి 30 లోపే కుండల అమ్మకాలు జరగ్గా, ఈ నెల 5వ తేదీ నుంచి రోజుకు సుమారుగా 50 వరకు మట్టి కుండల విక్రయలు జరుగుతుండడం విశేషం. వచ్చే నెలలో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని అమ్మకందారులు చెబుతున్నారు. కుండ సైజును బట్టి ఒక్కోటి రూ.100 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. దీంతో కుండల తయారీదారులు, విక్రయదారులు తమ ఆదాయం మరింత మెరుగుపడతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మట్టి కుండను పరిశీలిస్తున్న కొనుగోలుదారు

వ్యాపారం కొంత పర్వాలేదు..



గతంలో జనవరి నెల నుంచే కుండల తయారీ పెద్ద ఎత్తున ఉండేది. ఏడాదిలో మూడు నెలలు సీజన్ కాగా మిగిలిన తొమ్మిది నెలలు ఉపాధి వెదుక్కోవాల్సిందే. వేసవి కాలం మూడు నెలలు వ్యాపారం బాగుంటుంది. ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నవారు కూడా మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు పల్లెల్లోనూ ఫ్రిజ్‌లు, కూలింగ్ క్యాన్లు వాడుతుండడంతో కుండల వ్యాపారం కొంత తగ్గినప్పటికీ మట్టి కుండల్లో నీరు తాగడం శ్రేయస్కరమన్న ఉద్దేశంతో మట్టికుండలు కొనుగోలు చేస్తున్నారు. కొంత వరకు పర్వాలేదు.

– నాని, మట్టి కుండల విక్రయదారుడు, కుమ్మరవీధి, 30వ వార్డు

వైభవంగా నీలమ్మ జాతర



వేపకొమ్మలతో ఊగుతున్న అమ్మలకు బిందెలతో నీరు పోస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న నీలమ్మ

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు వెలంపేట పువ్వులసందులో కొలువుదీరిన నీలమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు జాతర చేపట్టారు. జాతరలో భాగంగా ప్రదర్శించిన డాన్స్ బేబీ డాన్స్, ఆర్కెస్ట్రా, తప్పెటగుళ్లు, సేవగరిడి, నేల డ్యాన్సులు, పులివేషాలు, విచిత్ర వేషధారణలు, స్టేజి ప్రోగ్రామ్స్ అలరించాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. వచ్చేనెల ఒకటో తేదీన నీలమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు నీలమ్మ అమ్మవారి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు.

ఎమ్మెల్యే వాసుపల్లి దాతృత్వం



39వ వారుడ కోటవీధికి చెందిన షేక్ షబ్నం ఉన్నిసాకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధిలో పలు వార్డుల్లో పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆర్థిక సాయం అందజేశారు. 41వ వార్డు జ్ఞానాపురం గెడ్డవీధిలో నివసిస్తున్న దిసిరాం శివ అనారోగ్యంతో ఉన్నట్టు పార్టీ కార్యకర్తలు ద్వారా తెలుసుకుని వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు అందజేశారు. 27వ వార్డు చుక్కావీధికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చుక్కా మహేష్ పిల్లల చదువు కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేయడమే గాక ఆ పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి రూ.6,500 ఫీజు రాయితీ కల్పించారు. 39వ వార్డు కోటవీధికి చెందిన నిరుపేద షేక్ షబ్నం ఉన్నిసా పెళ్లికి రూ.5వేలు, 41వ వార్డు జ్ఞానాపురానికి చెందిన ఈసారపు కనకమహాలక్ష్మి సోదరుడు అనారోగ్యంతో ఉన్నట్టు తెలియడంతో వైద్య ఖర్చుల కోసం రూ.2,500 సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, విశాఖ దక్షిణ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు'



కుమ్మరవీధిలో పథకాల గురించి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పాల శ్రీహరిరెడ్డి, తదితరులు



వెంకటేశ్వరమెట్టపై కరపత్రాలు అందిస్తున్న యల్లంకి చిన్నమ్మలు తదితరులు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం దక్షిణ నియోజకవర్గంలో చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పాల శ్రీహరి రెడ్డి గృహసారథులు, కన్వీనర్లతో కలసి 33వ వార్డు కుమ్మరవీధిలో మంగళవారం పర్యటించారు. గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరాతీశారు. సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందజేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నట్లు తెలిపారు.

➡ వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షురాలు యల్లంకి చిన్నమ్మలు ఆధ్వర్యంలో వెంకటేశ్వరమెట్టపై పర్యటించారు. సంక్షేమ పథకాలు, వాటి లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు, సిబ్బంది

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిపించిన ఈ పూజలో అమ్మవారిని 108 స్వర్ణపుష్పాలతో అర్చించారు. పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. రూ.1500 పూజా రుసుం చెల్లించి, దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



మంటలు ఆర్పడంపై శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లిపురం: పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై కార్మికులకు అవగాహన అవసరమని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి ఆర్.వి.రమణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జ్ఞానాపురం దరి ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పల్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌లో అగ్నిప్రమాదాలు, వాటి నివారణ, పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రయోగాత్మకంగా అగ్ని ప్రమాదాల నివారణపై కార్మికులకు శిక్షణ ఇచ్చారు. పోస్టర్లు, కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ సీహెచ్.శ్రీనివాస్‌కుమార్, పి.ప్రసాద్, సీహెచ్.కనకరాజు, ఫైర్‌మెన్‌లు పి.శ్రీనివాసరావు, ఎస్.రాజానాయుడు, కె.పైడిరాజు, హోమ్‌గార్డ్ కె.బాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కలిసి పని చేద్దాం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయికాంత్ వర్మను జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అందరం కలిసి నగరాన్ని మరింత అభివృద్ధి చేద్దామని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ఆర్థిక పరిస్థితులను చూసుకుని బిల్లులు కూడా త్వరితగతిన విడుదల చేస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, కన్వీనర్ గొంప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సాధూరావు, ఉపాధ్యక్షుడు రామానాయుడు, జాయింట్ సెక్రటరీ రమేష్, కోశాధికారి నరసింగరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వాహనం అందజేత



లబ్ధిదారుడు గుమ్మడి పవన్‌కుమార్‌కు వాహన తాళం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకం కింద మంజూరైన వాహనాన్ని లబ్ధిదారుడు గుమ్మడి పవన్‌కుమార్‌కు అందజేశారు. మంగళవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయనకు వాహన తాళం అందించారు. ఈ వాహనం విలువ రూ.20 లక్షలు చేస్తుంది. ఇందులో రూ.12 లక్షలు సబ్సిడీ, రూ.8 లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేసిందని మత్స్యశాఖ జేడీ జి.విజయ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ పేర్రాజు



మాట్లాడుతున్న ఏపీజేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు

మహారాణిపేట: జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల కార్యాచరణ సమితి(అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌జీవో హోంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి.. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరావతి జేఏసీ కో–చైర్మన్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ త్రినాథరావు, ఏపీ భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమూర్తి, ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శారదారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



796వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 796వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సీఎంఎం, సీఈడీ, సీఆర్ఎంపీ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధం కావాలని కోరారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ఏఎంసీ జట్లు

విశాఖ స్పోర్ట్స్ : డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్‌సైన్సెస్ అంతర కళాశాలల గేమ్స్ పోటీల్లో ఏఎంసీ ఫుట్‌బాల్, టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఈ పోటీలు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్టుకు రాహుల్, బాల్ బ్యాడ్మింటన్‌కు శంకర్, టెన్నిస్ జట్టుకు ఆదర్శ్ కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ మన్మథరావు, రాజేంద్రప్రసాద్ ఆయా జట్లను అభినందించారు.

ఆకట్టుకున్న 'షేడ్స్ ఆఫ్ వైజాగ్'



పెయింటింగ్స్‌ను ఎగ్జిబిషన్‌ను సందర్శించిన సందర్శకులు

బీచ్‌రోడ్డు: మన సంప్రదాయలు, సాంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటీష్‌ల ఆరాచక పాలనను చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. ఆర్టిస్ట్ నరేష్ మెహతా వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన బుధ,గురువారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో హవామహల్ రాజా మాత మయంక్ కుమారి దేవి తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో అగ్నిప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక శకటం

బీచ్ రోడ్డు: సిరిపురం బాలాజీనగర్‌లోని వాల్తేర్ హైట్స్ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో ఉన్న హర్షిత శ్రీఅగ్రిఫుడ్స్ సంస్థలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏసీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కార్యాలయం సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ఘటనలో ఏసీలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర విభాగాల ఫుట్‌బాల్ విజేత మెకానికల్ జట్టు



మెకానికల్ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్ : ఈకోర్రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రైల్వేఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆపరేటింగ్ జట్టుపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో ఆపరేటింగ్ జట్టు టీఆర్‌డీ జట్టుపైన, మెకానికల్ జట్టు సివిల్ ఇంజినీరింగ్ జట్టుపైన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రికెట్ నాకవుట్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు 56 పరుగుల తేడాతో సిగ్నల్స్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. మెకానికల్ జట్టు ఐదు వికెట్లకు 177పరుగులు చేయగా సిగ్నల్స్ టెలికాం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది.